
# చంటినాన్నగారి కళ్ళు మనకెలా వొస్తాయి!




కంటి చూపులో పిసరంత తేడా రావడంతో కాకినాడెళ్ళి డాక్టరుగారికి చూపించుకొచ్చేడు చంటినాన్న.

అంతా అతన్ని చంటినాన్న అని పిలుస్తారుగానీ అతని అసలు పేరు చాలా మందికి తెలీదు. అసలు అతనికా పేరు ఎందుకొచ్చిందో ఎవరు పెట్టేరో కూడా తెలీదు.

ఇలాగ చిత్రమైన పేర్లతో పిలిపించుకునే జనం వూళ్ళో బానే ఉన్నారు. ఆఊఁధిఅన్న, ఉల్లిపాయల మేష్టారు, ఎర్రబ్బాయి,

**కోడిజుట్టు రాముా, తోకబావిరెడ్డి, ఉప్పుగ్రావు, బ్రేమ్మల బోడెమ్మ, చెప్పుకుంటా పోతే ఇలాగ చాలా మంది.**



చంటినాన్న వయసు ఏభై పైనుంటది. కీచుగొంతు బావురు పిల్లికళ్ళు, పై పొరగోకిన కందరంగు కర్రశరీరం. పొట్టి మనిషి, భుజం మీద వేసుకునే తువ్వాళ్ళు ఎక్కడ్నించి తెప్పిస్తాడోగానీ ఓ మాదిరి పెద్ద నల్లంచు దాని పక్కనే అంతకంటే కొంచెం సన్నటి నల్లంచు అలాగ సన్నగిల్లుతా కడాకరుకి పెన్సిలు గీత వెడల్పుతో ఆఖరయ్యేది. అదో గమ్మత్తయిన డిజైన్లే. చీలమండలు దిగేదాకా గ్లాస్కోపంచి, మోకాళ్ళు దిగిన పొడుగు చేతుల మెట్టూరు మల్లు చొక్కా. దాని కాజాలకి గొలుసుతో మెల్తేసిన బంగారపు బొత్తాలు. అతను బట్టలకి రాసుకునే అత్తరు ఆ మనిషి వెళ్ళిపోయేకాకూడా రెండు నిమిషాలపాటు వీధిని విడిచి పెట్టదు.

చంటినాన్న ఇల్లు కచేరీసావిడికి తిన్నగా ఉండే దేవాంగుల వీధిలో ఉంది. ముదురు నీలం రంగేసిన పెద్దడాబా ఇల్లది. దగ్గర దగ్గర ముప్పై మగ్గాల జనం అతని చేతిలో ఉన్నారు. వాళ్ళందరికీ భజాణాలు నూలుపిళ్ళు ఇచ్చి దుప్పట్లు నేయించి వారం వారం ద్వారపూడి హోల్సేలు మార్కెట్టుకి జెటారు ట్రాక్టరుతొట్లో వేసుకుని బయల్దేరతాడు. దీంతోపాటు ఇంటి అరుగుమీద గదిలో బట్టల కొట్టుంది. నరాలపాలెం వెళ్ళే రోడ్డులో ఊళ్ళో రెడ్లతో కల్సి ఇడ్లీనూక ఆడించేమిల్లులో వాటా ఉన్నాడు.

ముగ్గురు కొడుకులు. వ్యాపారాలు ఏ కొడుక్కీ అప్పజెప్పలేదు. అన్నీ తనే చూసుకుంటాడు. ఇదేంటని ఎవరన్నా కొడుకుల్ని అడిగితే "వ్యాపారం జెయ్యడంలో మానాన్నకి తెల్సిన సుళువూ లౌక్యం మాకింకా అబ్బలేదండి. నేర్చుకోవాలి ఆ మనిషి దగ్గర"అని తలొంచుకుని ఒప్పేసుకుంటారు. ఇంక ఇంట్లో కోడళ్ళ విషయానికొస్తే గోదారవతల మోరి, ద్రాక్షారం అవతల హసన్‌బాదా, ఎఱ్ఱపోతవరం వంతెన దిగి ఎడం పక్కకి మళ్ళితే వచ్చే అద్దంపిల్లినించి వచ్చిన మేలిం బంగారపు కణికలు. వాళ్ళు మావగారికిచ్చే మర్యాద ఇంతా అంతా గాదు. అసలు మావగారు ఇంట్లో కొస్తుంటే భయం...ఉచ్చా పేడా బందే.

భార్యపోయి చాన్నాళ్ళయిన చంటినాన్న అప్పుడప్పుడూ పెద్దాపురం, మండపేటా, మురమండా వెళ్ళొస్తుంటాడు. అదీ మూడోకంటికి తెలీకండా.

మండపేట క్రిష్ణాటాకీసులోకి భూకైలాస్ సరికొత్త కాపీ విడుదలైందని ఎనౌన్సుమెంటు బండోడు మైకులో మాఊరంతా అరిచి పాంప్లెట్సు విసిరిపోతే ఆ సాయంత్రం టింగురంగా మని తయారయిపోయి కాలవకాడికొచ్చి బస్సెక్కి తొలాట సినీమా చూసి బయటికొచ్చేటప్పటికి తొమ్మిది దాటేసింది టైము. రిక్షా కట్టించుకుని మసీదు దాటి వల్లూరి వారి వీధినించి కుడి పక్కనున్న "తడికెల బజారు సైడు పోనియ్యరా అబ్బులూ" అన్నాడు రిక్షాకుర్రోడ్ని. అక్కడంతా ఆడోళ్ళుంటారు. కాకినాడకి బుడంపేట ఎలాగో, రాజమండ్రికి ఇసకవీధి ఎలాగో మండపేటకి తడికల బజారు అలాగ.

* * *

అంత గొప్ప మనిషంట. ఆ మనిషి లాంటిదాన్ని తన జన్మలో ఎరగలేదట చంటినాన్న. పేరు మల్లికాసులు. ఎప్పుడూ లేనంత ఇదిగా అయిపోయిన చంటినాన్న తెల్లవార్లూ ఆ మల్లికాసుల్తోనే గడిపి తెల్లారేక జట్కాబండ్లో ఆ మల్లికాసుల్ని పసలపూడి తీసుకొచ్చి చెల్లూరు వంతెన దిగువలో మాచారం వెళ్ళే దారిలో చింతావారి కాఫీ హొటేలు పక్కనే ఉన్న పచ్చ కటకటాల బంగాళా పెంకింట్లో పెట్టేడు.

మామూలు విషయాలకంటే ఇలాంటివి చాలా జోరుగా పాకుతాయి జనంలోకి. గాబట్టి చంటినాన్న మల్లికాసుల్ని తీసుకొచ్చిన విషయం వూరి జనాబాకీ ఆ తర్వాత వాళ్ళ ఇంట్లో మనుషులికీ చాలా తొందరగానే తెల్సింది.

రాములోరి గుడి దగ్గరా, గొల్లల తూము దగ్గరా యఱ్ఱమిల్లి ప్రభావతిగారి కిరాణాకొట్టు దగ్గరా గుంపులు గుంపులుగా జేరిన కుర్రకారు ఆ మనిషిని చూద్దావన్న ఉబలాటం కొద్దీ బయల్దేరి చాటుగా చూసేసేరు మొత్తానికి.

నల్లగా జీడిపిక్కలాగుంది మల్లికాసులు శరీరం. నడుమూ సట్టా కల్సిపోయి నట్టున్నాయి. చిన్నికళ్ళు ముక్కులోపలికి పోయుంది. పిలకజెడ చివర్న ముదురు నీలం రంగు రిబ్బనుముక్క. "చీఛీ..ఇదా చంటినాన్న తీసుకొచ్చిన మనిషిదీనికంటే పాలేరు కుంటిరాంబాబు గాడి పెళ్ళాం నయ్యిం గదా" అనుకుంటా ఇదే ముక్క ఊళ్ళో టముకేసేసేరు. ఈళ్ళు చెప్పింది కరక్టోకాదో అనుకుంటా వెళ్ళి చూసొచ్చిన మిగతా జనం "ఆ మనిషిలో ఏం జూసి అంత అత్తారబతంగా తెచ్చి పెట్టుకున్నాడు చంటినాన్నగారు?" అనుకున్నారు.

నాలుగురోజులు గడిచాయి. పన్లన్నీ ఆపుకుని సీవండి సామాన్లు, ముతక చీరలూ, నవారు మంచం, చేటలూ చీపుర్లూ, ఇలాగ మల్లికాసులు సంసారానికి కావల్సిన సామాన్లకోసం ఊళ్ళోనూ, రామచంద్రపురంలోనూ కల తిరుగుతున్న చంటినాన్న బస్తాడు బియ్యం పట్టే పెద్ద బాన కావాలంటా కుమ్మరికోటయ్య ఇంటి కొచ్చినప్పుడు ఎదురైన పశువులకి వైద్యంచేసే షేక్ అమీర్‌సాహెబ్ ఆపేడు. ఊళ్ళో అందర్నీ వరసలు పెట్టి పిలిచే అలవాటున్న అమీర్‌సాయిబుకి చిట్టినాన్నతో మంచి చనువుంది.

"ఏంటి బావా..ఎవరో మనిషిని తీసుకొచ్చేవంట మండపేటనించి... చూడ్డానికే ఆ మనిషి పరమరోతగా ఉంటదట..నిజమేనా?" అన్నాడు.

ఆ సాయిబు ప్రశ్నకి అదోరకంగా నవ్వేస్తా అప్పుడే కరెంటు స్తంభం మీద వాలిన చెవిటి కాకిని జూస్తా "తీసుకురాడం దాకా నిజమే బావా..ఆ మనిషి మట్టుకి రోతగా ఉండదు...నా కళ్ళకి" అన్నాడు.

"మరి అంతా అలా గంటన్నారేంటి బావా?" ఎదురడిగేడు అమీర్‌సాయిబు.

"ఏడ్సేరు... ఆ ఎదవల్ని నా కళ్ళతో జూడమని చెప్పు బావా"అనేసెళ్ళిపోయేడు చంటినాన్న.

* * *

మంగళవారం లక్ష్మివారం ఊళ్ళో జరిగే సంతలకి తనే వెళ్ళి కూరగాయలూ నీచుకూరలూ ఏరి మరీ కొని తెచ్చుకుంటాడు. ఆ తెచ్చినవి వండితేనే తింటాడు అంతే.

ఆ వేళ సంత.

ఎప్పుడూ ఒక కాకీ సంచితో సంతలో కొచ్చే చంటినాన్న ఆవేళ రెండుకాకీ సంచుల్తో సంత చేస్తుండటం చూసిన వెంకట్రెడ్డి మేష్టారు "ఏంటి చంటినాన్నా రెండు సంచులేంటి" అన్నారు.

"రెండు సంతలు మేష్టరుగారూ!" అన్నాడు చంటినాన్న.

"అర్థవయిందిలేవో ఒక సంత మీ ఇంటికి మరి రెండో సంత ఎక్కడికంట?"

చెప్పడానికి ఇబ్బంది పడకండానే చెప్పేసేడు.

విన్న వెంకట్రెడ్డి మేష్టారు "మనలాంటి పెద్దోళ్లమే ఇలా జేస్తే మనల్ని జూసే పిల్లల సంగతేంటి?" అన్నారు.

"ఇంతకు ముందు నా గురించి మీకు తెల్సుగదా మేష్టరుగారూ..ఇది మీ అందరికీ తప్పయితే ఇదే నేను జన్మలో చేసిన మొదటి తప్పు" అన్నాడు.

ఆలోచించిన మేష్టారు "అంత గొప్పదా ఆ మనిషి?" అన్నారు.

"నాకళ్ళతో జూస్తే తప్ప మీకు తెల్దండీ" అనేసెళ్ళిపోయేడు చంటినాన్న.

* * *

గోరు వెచ్చటి ఎండకాస్తున్న ఆ సాయంత్రం పూట పొలాల్లో దిబ్బలమీద వేసిన వరికుప్పల కుచ్చునాటుల్ని పొడుచుకు తింటున్నాయి రామచిలకలు. కోసేసిన చేలల్లో పాటకపోళ్ళ పిల్లలు వరి ఎన్నులు ఏరుకుంటున్నారు. మల్లిడి దొరారెడ్డిగారి పాకలో నిలబడి గడ్డి మేస్తున్న సూడిగేది కాళ్ళ మధ్యలోఉన్న పిల్లలకోడి గింజల్ని గెలుక్కుంటా తింటంది. స్మశానంలో ఆరేసిన బట్టలు మడత లెట్టుకుంటున్నారు. చాకలాళ్ళు చెరువుకి రెండో పక్క గట్టుమీద గన్నేరు చెట్లు వాటి నీడల్ని అవే చూసుకుంటున్నాయి. మల్లికాసులు బట్టలింకా తేలేదేంటని చాకలి పుల్లయ్యని అడగడాని కొచ్చిన చంటినాన్నకి ఎదురుబడ్డ కోరుకొండ అబ్బాయి "ఎప్పుడూ లేంది ఏంటిది చంటినాన్నా ... ఆ మనిషిని పంపించెయ్యి" అన్నాడు.

"అబం శుబం తెలీని మా మల్లికాసులు... నన్నొదిలి ఎక్కడి కెళ్ళద్దంట?" ఎదురడిగేడు చంటినాన్న.

"ఇంతకుముందు ఎక్కడ్నుంచొచ్చిందో అక్కడికే" అన్నాడు అబ్బాయి.

''ఎక్కడ్నించి వచ్చిందో నేనెప్పుడూ అడగలేదు... నాకు తెలియకుండా ఎక్కడికీ వెళ్లదు... నేను బతికుండగా వెళ్ళదు అసలలాంటి మనిషి నాకు దొరకడం నేను పూర్వజన్మలో చేసుకున్న పుణ్యం అనేసి నేను ఇదవుతుంటే నువ్వేంటి?''.

''అసలా మనిషిలో ఏం జూసి ఇంత ఇదైపోతున్నావ్ నువ్వు?''

''నా కళ్ళతో జూస్తే తప్ప తెలీదు మీకెవళ్ళకీ''.

ఈ ముక్క విన్న జనమంతా ''ఈ ముసలోడి కళ్ళు అంత గొప్పయ్యేంట్రా'' అని వేళాకోళాలాడుకున్నారు.

చంటినాన్న కంటి చూపులో మళ్ళీ తేడా కనిపిస్తే మళ్ళీ కాకినాడెళ్ళి డాక్టరుగారికి చూపించి మందులు రాయించి తెచ్చుకున్నాడు.

* * *

ఆ వేళ మధ్యాన్నం ఉప్పుడు బియ్యం నూక ఆడే మిల్లులో సాటి వాటాదారుడు. మల్లికాసులు పేరు జోడిస్తా చిన్న విసురు విసిరేడు.

విన్న చంటినాన్న ''అందర్లాగే ఈడూ ఏదో అంటున్నాడులే అయినా ఇలా అక్రమ సంబంధం బెట్టుకుని ఆడదాన్ని తీసుకొస్తే ఇలాగే అనుకుంటుందిలే ప్రపంచకం''అని సర్దేసుకున్నాడు.

ఇందాక ఆ ముక్క అన్న వాటాదారుడు మళ్ళీ అదే ముక్కతిప్పి అన్నాడు. చుట్టూరా జేరిన కూలోళ్ళు నవ్వుతున్నారు.

మళ్ళీ ఇంకోసారి... మళ్ళీ ఇంకోసారి.

ఈసారిది కొంచెం విచ్చలవిడి విసుల్లాగ అనిపించడమే గాకండా అందులో బూతుమాట కల్సేటప్పటికి చేగల్నాడులో చింతపండు పిక్క తీసే అలుగుతో గుండెకాయలోకి దించినట్టయ్యింది. గిరుక్కున వెనక్కి తిరిగిన చంటినాన్న లాగిపెట్టి కొట్టేసేడా మనిషిని.

దెబ్బ పడ్డవాడు తక్కువోడుగాదు. ఏభై ఎకరాలు ఏకదొడ్డిగల వెంటూరుచౌదరి బావ్మరిది. గొడవైంది. అక్కడున్నోళ్ళంతా చౌదరి బావ్మరిది సైడే నిలబడ్డారు. పౌరుషం పెరిగిన చంటినాన్న ''ఈ రకం జనాబాతో వుండటం కష్టంలే... నా వాటా నా కిచ్చెయ్యండి'' అన్నాడు.

ఆ వారం తిరక్కుండానే చంటినాన్న వాటా చంటినాన్నకి పంచేసి పంపించేసేరు బయటికి.

* * *

చంటినాన్న బట్టలకొట్టులో ఎక్కువ కాతాలు చెల్లూరు సుగరు ఫేక్టరీలో పనిచేసే జనాలవి. ముందు అరువులు తీసుకుని ఫస్టుతారీఖున జీతాలొచ్చినప్పుడు వాయిదాలుగా కట్టేస్తుంటారు. అలాంటిది ఇప్పుడు జీతం అందుకుని వారం దాటినా చంటినాన్నకి కనపడ్డమే మానేస్తున్నారు.

''ఎప్పుడూలేంది ఏంట్రా ఇదీ అని?'' వాళ్ళిళ్ళకెళ్ళి అడుగుతుంటే ''కొంచెం ఇబ్బందుల్లో ఉన్నాం'' అంటున్నారు. కాదూ గూడదంటే కయ్యిమని లేస్తా కయ్యానికి దిగుతున్నారు.

ఇలాగవ్వడంతో కొన్నాళ్లకి కొట్టు తలుపులు మూసెయ్యాల్సొచ్చింది.

అటు ఊరిజనం సరే ఇంట్లో కొడుకులకి కూడా తనమీద మర్యాద లేకుండా పోయింది. మావగార్ని చూస్తేనే గజగజా వణికిపోయే కోడళ్ళు తన కళ్ళ ముందే ఊళ్ళో గొడవలన్నీ మాటాడేసు కుంటున్నారు.

ఒకో వ్యాపారం మూతపడ్డంతో పనిలేకుండా పోయిన చంటినాన్న మల్లికాసుల్ని బెట్టిన ఇంట్లోనే ఎక్కువసేపు ఉంటున్నాడిప్పుడు.

* * *

ఎక్కడలేని ధైర్యం వచ్చేసిన కొడుకులు చీటికీ మాటికీ ఎదిరించడం మొదలెట్టేరు. ఆవేళ రాత్రి తండ్రిని వాకిట్లో మంచంమీద కూర్చోబెట్టి "మన కుటుంబం ఇలాగవ్వడానికి కారణం ఆ మల్లికాసులు ముండే..దాన్ని వెంటనే పంపించెయ్యి" అన్నారు.

ఏం మాటాడలేదు చంటినాన్న.

"ఆ దరిద్రపు గొట్టు మనిషిని అమాంతంగా ఏ కాకినాడ సముద్రంలోనో తోసేస్తావా లేదా?" అన్నారు. ఆ తర్వాత కోడళ్ళు కూడా అందేసుకున్నారు. ఎవళ్లనోటికొచ్చినట్టు వాళ్ళు మాటాడ్డం అయ్యేక "ఆ మనిషి గురించి ఇంక ఒక్కముక్క మాటాడితే మిమ్మల్ని నరికిపారేస్తాను" అనేసెళ్ళిపోయేడు.

కంటిచూపులో బాగా తేడా కనిపించడంతో కాకినాడెళ్ళి డాక్టరుగారికి చూపించుకుని ఇంటికొచ్చి చూస్తే ఇల్లంతా బోసిగా ఉంది. మల్లికాసులు లేదు.

ఏమైందా అని ఇంటిచుట్టూరా వెతుకుతుంటే పక్కనే ఉన్న సత్రంలోకి అప్పుడే గట్టు దిగుతున్న అన్నపూర్ణ కావిడిసాధువు "సందకాడ ఊళ్ళో మాదాకవళం అందుకోడానికెళ్తే చూసేను బాబా ముగ్గురు మగోళ్ళు వచ్చేరు. ఆళ్ళెనకాల ఆడోళ్ళొచ్చేరు. ఆళ్ళు మీ ఇంట్లోవోళ్ళే అని అర్థవయ్యింది మాకు. ఈళ్ళంతా కల్సి ఆ ఇంట్లో కాపరం జేస్తున్న మనిషిగుండారం విప్పేసి జుట్టు పట్టుకుని ఈడ్చుకుంటా పోయేరండి... ఆ మనిషి ఏడుస్తుంటే సంటిపిల్ల ఏడుస్తున్నట్టు అనిపించింది. మా సత్రంలో జనవంతా ఒకటే ఇదయిపోయేంబాబూ" అన్నాడు.

ఇంటికెళ్లి సరిగట్టేటప్పుడు వాడేపలుపుతాడు మడతేసి ఒకో కొడుకుని చితక చితకబాదుతుంటే చివరికి చెప్పేరు. మల్లికాసుల్ని కోటిపిల్లి బస్సెక్కించేసేం అని.

* * *

కోటిపల్లి రేవుకీ ముక్తేశ్వరం రేవుకీ మధ్యలో ఉన్న తొగరుపాయ దగ్గర కూర్చుని ఏడుస్తున్న మల్లికాసుల్ని చూసిన చంటినాన్న గబగబా దగ్గరకెళ్తే "వద్దండి మీతో నేనుండటం మీ వూళ్ళో జనానికే కాదు ఆ బగమంతుడికే ఇష్టం లేదండి. ఇందాక జూడండి ఏవయిందో" అంటా గోరూడిపోయిరక్తం కారి ఎండిపోయిన బొటనవేలు చూపించింది మల్లికాసులు.

ఇంకేం మాటాడనియ్యకుండా బలవంతాన లేపేడు చంటినాన్న.

* * *

ఆవేళ రాత్రిపూట ఎక్కడా సందివ్వకుండా కురుస్తుంది వర్షం. విసరిసిరి కొడ్తుంది ఈదురుగాలి. ఎక్కడో దూరంగా ముందు మెరుపులు ఆ తర్వాత పిడుగుపడ్డ చప్పుళ్ళు. పేడ కసురురంగు మిలట్రీరగ్గుని మల్లికాసులు వంటినిండా కప్పి 'నేనున్నంతకాలం నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదొలే" అనుకుంటా గాలికి ఊగే లాంతర్ని చూస్తున్నాడు చంటినాన్న.

వూళ్ళో తెల్లారింది. వర్షం ఆగింది. గాలి వీస్తానే ఉంది. చెట్ల ఆకుల మీదాగిన చినుకులు ఇప్పుడు గాలిలో కల్సి నేలమీద రాల్తున్నాయి.

దెయ్యాల సుబ్బారావు రిక్షా ఎక్కి ఇంటికెళ్ళి జూసిన చంటినాన్నకి కాళీగా కనిపించింది ఇల్లు. మిగిలిన డబ్బూ బంగారం మూట గట్టు కున్న కొడుకులూ కోడళ్ళు రాత్రికి రాత్రే అద్దరికి వెళ్ళిపోయేరంట. పోతా పోతా కాఫీ హొటేలు గోపాల్రావు దగ్గరకొచ్చి "మా నాన్న దాన్ని బయటికి తోలేసేడు అన్న వార్త మాకు తెల్సిన రోజు ఈ బూప్రెపంచకంలో ఎక్కడున్నా వచ్చి పసలపూడిలో వాల్తామని జెప్పండి" అనేసి మరీ వెళ్ళి పోయేరంట.

"ఏడిసేరు నా ప్రాణమైన మల్లికాసుల్ని వదిలెయ్యడం అన్నది ఈ జన్మకి జరగని పని" అనుకున్నాడు చంటినాన్న.

* * *

చంటినాన్న ముఖం బాగా వడిలిపోయింది. మనిషికూడా ఒంగిపోయేడు. తొడుక్కున్న ముతక ఖద్దరు చొక్కా పిట్లుపోయుంది. కుట్టు నిలబడిన చోట ఎర్ర రంగుదారంతో వచ్చీరాని కుట్లేసుకున్నాడు. నడుస్తుంటే అరిగిపోయిన చెప్పులకి దిగేసిన మేకులు పైకిలేస్తున్నాయి. పండిపోయి బాగా పెరిగిపోయిన గెడ్డాన్ని నీరసంగా నిమురు కుంటున్నాడు.

చూపులో బాగా తేడా వచ్చెయ్యడంతో పడతా లేస్తున్నాడు. అతన్నలా చూసిన వూళ్ళో వైద్యం చేసే బడే సాయిబుగారు కాకినాడ తీసుకెళ్ళేరు. పరీక్ష చేసిన డాక్టరుగారు ''రెండు వారాల తర్వాత ఫలానా తారీఖున వస్తే రెండు కళ్ళకీ ఆపరేషను చెయ్యాలి. ఆరోజు తప్పకుండా రావాలి. నిర్లక్ష్యం చేస్తే రెండు కళ్ళు పోతాయి'' అని వార్నింగిచ్చి పంపించేరు.

శివరాత్రొచ్చింది.

కోటిపల్లి గోదాట్లోకి స్నానానికెళ్ళిన మల్లికాసులు రేవులో మునుగుతా తేల్తా ముందు కెళ్ళడంతో కత్తిరోడ్లో దిగబడిపోయింది.

మనిషింకా రాలేదేంటా అనుకుంటా గుమ్మం దగ్గర నిలబడి కంగారు పడిపోతున్న చంటినాన్న ఎదరకొచ్చి నిలబడ్డ మంత్రాలమూర్తిగారు కోటిపల్లి శివరాత్రి స్నానానికి తనూ వెళ్ళినట్టు చెప్పి అక్కడ జరిగిందంతా చెప్పి ''శవం ఎదుర్లంకరేవులో తేలిందంట పద వెళ్దాం'' అన్నారు.

రెండు ఐసుగెడ్డల మధ్య చేపలాగ బిగుసుకు పోయిన చంటినాన్న ఎప్పటికో తేరుకున్నాడు. బయటికొచ్చి మంత్రాలమూర్తిగారితో పాటు ఆదరాబాదరా నడవాల్సిన ఆ చంటినాన్న లోపలికెళ్ళి తలుపు లేసేసుకున్నాడు.

ఎవరొచ్చి ఎంత అరిచినా తెరవలేదు తలుపులు.

ఆరోజు కాకినాడ కళ్ళ డాక్టరుగారు రమ్మన్నరోజు.

వచ్చిన బడేసాయిబుగారు తలుపులు బాదుతా ''ఈ వేళ నీ కళ్ళకి ఆపరేషన్ చెయ్యకపోతే నీ చూపు మొత్తం పోతుందన్నాడు ఆ డాక్టరు...తలుపు తెరు బయల్దేరదాం'' అన్నాడు.

తలుపులు తెరవలేదు చంటినాన్న ఆ చీకట్లోనే ఉండిపోయిన చంటినాన్న ఎంత మందొచ్చినా ఎంత అరిచినా తెరవలేదు తలుపులు. ఎప్పటికీ తెరవలేదు తలుపులు. ఎన్నాళ్ళకీ తెరవలేదు. ఆ చీకట్లోనే ఉండిపోయాడు. ఆ చీకట్లోనే కల్సిపోయేడు.

* * *